తన కర్తవ్యాన్ని విద్యుక్త ధర్మాన్నీ విడిచి వుండలేడు. అది అసంభవం. కానీ తనలో పొంగి పొరలే భావావేశాన్ని చిత్రీకరించకుండా బ్రతకలేడు. అనుభూతులూ అనుబంధాలకూ అతిదూరంగా జడ పదార్థంలో నిలువలేడు. ఇది జరగని పని.

కాని...కానీ ఈ మానసిక సంఘర్షణ ఎప్పుడూ ఇలాగే వుంటుందా? తన మనస్సు అందరిలా నిశ్చింతగా వుండనివ్వదా!

మనుషులపై అన్ని అనుబంధాలనూ త్రెంచుకుని హృదయంలేని పాషాణంగా నిలుస్తే వైద్యుడిగా ఎటువంటి సంఘర్షణ అందుకోలేడు.

అటువంటి తరుణంతో హృదయ శూన్యమైన కవిగా తన చేతినుండి వెలువడే రచనలలో జీవం ఎంతవరకు వుంటుంది...?

హృదయ సౌకుమార్యం కలిగి సౌందర్యాన్వేషణలో, రసిక మనోభావాలతో రచయితగానే నిలుస్తే...!

ఆ సౌకుమార్య హృదయాన్ని శస్త్రచికిత్స క్షణక్షణం ఛేదిస్తూ వుంటే ఆ నరక యాతన అనుభవించగలడా!

ఈ విరుద్ధభావ సంగమం తన హృదయంలో రేపే చిచ్చు ఆరని దావాగ్నిలా మండుతోందే...! ఏది దారి...?

ఏది సాధ్యం...! ఏదసాధ్యం!

ఏ ఒక్కరో తను ఇరువురూ తనలో మసిలే అవకాశమేలేదా! అది అసంభవమా? లేక తన మానసిక బలహీనతకి ఇదొక పరీక్షా!

ఏదీ నిర్ణయించుకోలేక పోయాడు వేణు.

తీవ్ర సంఘర్షణ మధ్య నలిగి పోయాడు.

ఈ సంఘర్షణ నెదుర్కొని నిలువలేడా! ఒక స్త్రీవల్ల ఇంతగా మనస్తాపాన్ని అందుకుంటున్నాడే ... తన హృదయం ఇంత బలహీనమైనదని ఊహించలేదే ....!

కొద్దిక్షణాలు మౌనంగా వుండిపోయాడు. మనశ్శాంతిని కోరి తెచ్చుకున్నాడు. అశాంతి విప్లవాలు బలవంతంగా తప్పుకుంటున్నాయి. మనసును దిటవు పరచుకున్నాడు.

అలవాటు పడిన చెయ్యి తిరిగి భావావేశంతో కాగితం మీద పరుగులు ప్రారంభించింది.

'డాక్టర్! డాక్టర్!...మిసెస్ జానకి సూయిసైడ్ చేసుకున్నారు...!' ఆయాస పడుతూ ఆందోళనతో చెబుతోంది సిస్టర్...!

అదిరి పడిలేచి నుంచున్నాడు వేణు. లోకమంతా కళ్ళముందే తిరిగి పోతోంది. చైతన్యాన్ని మనో బలాన్ని కోల్పోతున్న వేణు బలంగా ప్రక్కనే వున్న బీరువాని చేయూత కోరాడు.

'ఎంతపని చేశావు జానకి...!'

గొంతు తడి ఆరిపోయింది. హృదయం బద్దలై పోతోంది.

'నీ కవితకు నేనే ఊపిరన్నావుగా... ఈ ఊపిరే పోతే...నువ్వు...!'

'జానకి...,' ఆవేశంతో అరుస్తూ నవలని గట్టిగా పట్టుకున్నాడు.

తిరిగి మనో దౌర్బల్యం గర్వంగా ప్రవేశించింది. ఆత్మ విశ్వాసం, అన్ని సంఘర్షణలు క్రమ క్రమంగా దూర మౌతున్నాయి.

కవి నిష్క్రమణ కోసం మరింత జాలిగా చూస్తున్నాడు.

'నేనింక ఆత్మవంచన చేసుకోలేను జానకీ! అసత్యాలూ, అసంభవాలూ అయిన జీవితాన్ని తీయగా వ్రాసి నన్ను నేనే మభ్య పెట్టుకోలేను. మోసగించుకోలేను. ఎండ మావులనూ. మిధ్యాబింబాలనూ నమ్ముకుని ఆత్మవంచన చేసుకోలేను. నువ్వే జయించావు జానకి......

నాలోని కవిత...నశించింది...కవి...చచ్చి పోయాడు!'

పిచ్చిగా నవ్వుతూ నవలని ముక్కలు ముక్కలు చేశాడు...

ఎక్కడోవున్న జానకి ఆత్మ ఎందుకో గర్వంగా నవ్వుతోంది.

కిటికీ తలుపులు బలంగా పట్టుకుని పిచ్చిగా ఎటో చూస్తున్నాడు వేణు. విసురుగా వీచిన గాలికి కాగితం ముక్కలు ఎగిరి ఎక్కడికో గాలిలో తేలిపోతున్నాయి.

చిరుగాలితో కలిసి వచ్చిన నీటిబిందువు వేణు చేతిపై పడింది ... మరుక్షణంలో అదృశ్యమైపోయింది...

# మహీధరోక్తులు

మహీధర నళినీమోహన్‌రావు



వేపనట్టి వెళ్ళ శిరంగ నీతులు
దూరు నట్టి వెళ్ళ దొమ్మరిండ్ల
మంత్రులైన వారి
తంత్రమెట్లుండునో
హృదయవర్తి యీ మహీధరోక్తి.